కరాటేలో సత్తా చాటిన విద్యార్థులు

కందుకూరు, జనవరి 21: కోయంబత్తూరులో జరిగిన సౌత్ జోన్ ఖేలో ఇండియా ఉమెన్స్ వుషు జూనియర్ కరాటే లీగ్ పోటీల్లో సార్లరావులపల్లి తండాకు చెందిన గిరిజన విద్యార్థిని, సర్పంచ్ రజిత ప్రవీణ్ నాయక్‌ల కూతురు భువన 3వ స్థానాన్ని దక్కించుకొని పతకం సాధించింది. కోచ్ సతీశ్ కుమార్ ఆ విద్యార్థిని అభినందించారు.

ఆలయాల శుభ్రత అందరి బాధ్యత

సైదాబాద్, జనవరి 21: ఆలయాల పరిశుభ్రత భక్తులందరి బాధ్యత అని భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేందర్ బాబు యాదవ్ తెలిపారు. ఆదివారం ఐఎస్ సదన్ డివిజన్ ఇంద్రప్రస్త కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయాన్ని శుభ్రం చేశారు. శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఆలయంలో హోమం, భజనలు నిర్వహించనున్నామన్నారు.

బంగారు భవితకు .. అత్యుత్తమ బోధన

- కార్పొరేట్‌కు దీటుగా మైనార్టీ గురుకులాలు
- నాణ్యమైన విద్య..రుచికరమైన ఆహారం
- ప్రారంభమైన అడ్మిషన్లు

సైదాబాద్, జనవరి 21: మైనార్టీ పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన మైనార్టీ గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లకు విశేష స్పందన లభిస్తున్నది. 2024-25 విద్యాసంవత్సరం ప్రవేశాలల్లో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆకస్తి చూపిస్తున్నారు. ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని శ్రీనివాసకాలనీ (చంపాపేట)లో ముషీరాబాద్ మైనార్టీ పాఠశాలకు, జూనియర్ కళాశాలలో చేర్పించేందుకు చాలమంది ఆసక్తి చూపిస్తున్నారు. ఇందులో మైనార్టీలకు 75 శాతం, ఇతర వర్గాలకు 25శాతం సీట్లను కేటాయించటంతో ఈ విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశం పొందనున్నారు.

ఐఎస్ సదన్ డివిజన్‌లోని మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల భవనం

భోజనం చేస్తున్న విద్యార్థులు

ఉత్తమ విద్యాబోధనతో...

ఇంగ్లిష్ మీడియంలో బోధించడంతో పాటు క్రీడలు.. వ్యాయామంపై ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తూ ఉత్తమ క్రీడాకారులను తయారు చేస్తున్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. సీసీ కెమెరాల ద్వారా తరగతి గదిలో జరుగుతున్న పాఠాలను ప్రిన్సిపాల్ నిరంతరం పర్యవేక్షిస్తుండటంతోపాటు వాటిని హెడ్ ఆఫీస్‌కు కనెక్టివిటీ లింకేజ్ చేయటంతో తరగతి గదుల్లో ఉపాధ్యాయులు బోధించే పాఠాలను నేరుగా ఉన్నతాధికారులు వీక్షించవచ్చు.

చక్కటి పౌష్టికాహారం..

ప్రతి విద్యార్థికి బెడ్ (మంచం), మూడు జతల స్కూల్ యూనిఫాంలతో పాటు స్పోర్ట్స్ డ్రెస్, షూలు వంటి అన్ని వస్తువులను ఉచితంగా అందజేస్తున్నారు. మినరల్ వాటర్, డైనింగ్ హాల్, స్లీపింగ్ హాల్, విద్యార్థుల భద్రత కోసం సెక్యూరిటీ గార్డ్స్‌ను నియమించారు. విద్యార్థుల శారీరక ఎదుగుదలను దృష్టిలో పెట్టుకొని నెలలో ఆరుసార్లు చికెన్, రెండు సార్లు మటన్, ఐదుసార్లు కోడిగుడ్డు, రోజు పండ్లు, స్నాక్స్, రుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నాం..

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నాం. కార్పొరేట్ స్థాయి విద్యతోపాటు, వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నాం. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు నిరంతరం శ్రమిస్తూ.. ఉన్నత విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్నాం. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు తల్లిదండ్రులు బంగారు బాటలు వేయాలి. తమ పాఠశాలలో ప్రవేశం పొందేందుకు 79950 57875, 99081 46808లో సంప్రదించాలి.

– నర్సింహ,ప్రిన్సిపాల్, మైనార్టీ గురుకుల పాఠశాల, ముషీరాబాద్

కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ రంజిత్ రెడ్డి

రూ.200 కోట్లతో జల్‌పల్లి అభివృద్ధి చేశాం

బడంగ్‌పేట, జనవరి 21: రూ.200కోట్లతో జల్‌పల్లి మున్సిపాలిటీని అభివృద్ధి చేశామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. చేవెళ్ల, హైదరాబాద్ ఎంపీ సీట్లు గెలిపించి.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు గిఫ్ట్ ఇవ్వాలని కార్యకర్తలకు సూచించారు. పహాడీ షరీఫ్ ప్రీమియం గార్డెన్‌లో ఆదివారం రాత్రి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో భారీ మెజార్టీతో గెలిపించారని.. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని తెలిపారు. తదనంతరం ఎంపీ రంజిత్ రెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపించాలని.. ఎంపీ, ఎమ్మెల్యే నిధులతో ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కార్తీక్ రెడ్డి, జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాదీ, వైస్ చైర్మన్ ఫరాన్ నీజ్, బీఆర్ఎస్, ఎంఐఎం నాయకులు హైమత్ సాదీ, ఉమర్ బామ్, జనార్దన్, లక్ష్మీనారాయన్, కొండల్ యాదవ్, దస్తగిరి, షేక్ అబ్జుల్, శంశిద్ దీన్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనుల్లో జాప్యం చేయొద్దు

మీర్‌పేట కార్పొరేషన్ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, జనవరి 21: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణ పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతోందని మాజీ విద్యాశాఖ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి సంబంధిత కాంట్రాక్టర్లను ప్రశ్నించారు. ఆదివారం మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మిథిలానగర్‌లో నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రూ.2 కోట్లతో చేపట్టిన నిర్మాణ పనులు ఇప్పటికే పూర్తి కావాలన్నారు. మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, మాజీ ఎంపీపీ సిద్దాల లావణ్య బీరప్ప, మీర్‌పేట బీఆర్ఎస్ అధ్యక్షుడు కామేశ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆలయాల శుభ్రతకు ముందుకు రావాలి

ఆర్కేపురం, జనవరి 21 : ఆలయాలను శుభ్రపరిచేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆర్కేపురం కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి తెలిపారు. స్వచ్ఛ తీర్థ ఆధ్యాత్మికలో భాగంగా ఆదివారం ఎస్.ఆర్.కె.పురం మహిళామండలి ఆధ్వర్యంలో ఆర్కేపురం డివిజన్ ప్రసన్నాంజనేయ దేవాలయాన్ని శుభ్రపరిచారు. ఆలయాల శుభ్రతలో భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు అన్నపూర్ణ, కార్యదర్శి రాధ ఉన్నారు.

ఆలయాన్ని శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ రాధ, మహిళా మండలి సభ్యులు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

వనస్థలిపురం, జనవరి 21: కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. హస్తినాపురం డివిజన్ సాయిప్రకాశ్‌నగర్ కాలనీవాసులు ఆదివారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీలో ఉన్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. కాలనీవాసులు తమ దృష్టికి తీసుకువచ్చిన అన్ని పనులను పూర్తి చేస్తామన్నారు. ప్రజాధనం వృథా కాకుండా పనులు పూర్తి చేస్తామన్నారు. అభివృద్ధి పనులు జరుగుతున్నచోట కాలనీవాసులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసిన సాయిప్రకాశ్‌నగర్ కాలనీవాసులు

అన్నదానం

ఆర్కేపురం, జనవరి 21 : రెడ్డి హిల్స్‌లోని నిలోఫర్, యమ్‌యన్‌జీ క్యాన్సర్ దవాఖాన వద్ద ఆదివారం రెడీ టు సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సినీ నటులు విజయ్ భాస్కర్, లొరా ముద్దిసాన్, కార్తీక సామా, మురళీ కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని దానాల్లో కెల్లా అన్నదానం ఎంతో గొప్పదన్నారు. ప్రతి ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద రెడీ టు సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రెడీ టు సర్వ్ ఫౌండేషన్ నిర్వాహకులు పెద్ది శంకర్, ప్రవీణ్‌జాన్, నరసింహ, మోహన్ లాల్, ప్రకాశ్‌యాదవ్, నాయకుడు, నితిన్‌గౌడ్, ఇంద్ర కర్ణ, చారి, శ్రీనాథ్ ఉన్నారు.

ఆలయాలు ముస్తాబు

ఎల్బీనగర్, జనవరి 21: అయోధ్యలో రాముల వారి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఎల్బీనగర్ నియోజకవర్గం వ్యాప్తంగా అంతా రామమయం.. జగమంతా రామమయం అన్నట్లుగా దేవాలయాలు, కూడళ్లు, వీధులను తీర్చిదిద్దుతున్నారు. నియోజకవర్గంలోని పదకొండు డివిజన్లలో స్క్రీన్‌లు ఏర్పాటు చేసి ప్రజలు నేరుగా తిలకించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే విధంగా రామాలయాలు, హనుమాన్ మందిరాలతో పాటు ఇతర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులకు అన్నదానం చేసేందుకు జోరుగా ఏర్పాట్లు చేస్తున్నారు. దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయంలోనూ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు.

నేడు హయత్‌నగర్ ఆర్టీసీ డిపోలో...

హయత్‌నగర్, జనవరి 21: ఆర్టీసీ హయత్‌నగర్ డిపో-1 ఆవరణంలోని ఆలయం వద్ద శ్రీరాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ జలగం విజయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామ మందిరం ప్రారంభోత్సవం కోసం ఎదురు చూస్తున్న శుభ సందర్భంగా డిపోలోని అమ్మవారి సన్నిధిలో మందిర ప్రారంభోత్సవ వేడుకలను నిర్వహించనున్నామని తెలిపారు. ఉదయం 11.30 గంటలకు శ్రీరాముడికి ప్రత్యేక పూజలు, సాయంత్రం వేళ ప్రమిదలతో దీపాలు వెలగించడం జరుగుతుందని వివరించారు.

నేడు ప్రత్యేక పూజలు..

మాదన్నపేట: అయోధ్యలో రాముల వారి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా సంతోష్‌నగర్ లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, ఉప్పరిగూడ శ్రీ రామమందిరంలో పూజలు నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకుడు శ్రీనివాసా చార్యులు తెలిపారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న లతామా ఫౌండేషన్ చైర్మన్ మాధవి లత కొంపెల్ల

సైదాబాద్, జనవరి 21: అయోధ్య రామ మందిరంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని ఆదివారం సైదాబాద్ డివిజన్ ఏపీఏయూ కాలనీలోని శ్రీధర్మ నిలయంలో లతామా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన సీతా రాముల కల్యాణోత్సవానికి లతామా ఫౌండేషన్ చైర్మన్ మాధవి లత కొంపెల్ల ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు రమేశ్ రాజు, పరమేశ్, ఆర్ఎస్ఎస్ నాయకులు, కాలనీవాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపు

సైదాబాద్, జనవరి 21: సింగరేణికాలనీ వాంబే క్వార్టర్స్‌లోని ఖాళీ ప్రదేశంలోని వ్యర్థాలను ఆదివారం దసేఫ్ ఫౌండేషన్, ఐ లోకల్ దళిత ఉమెన్స్ కలెక్టివ్ సంయుక్త ఆధ్వర్యంలో తొలగించారు. ఖాళీ ప్రదేశ స్థలాన్ని చిన్నారులకు క్రీడా మైదానంగా మార్చాలని, ఇందుకు స్థానిక ప్రజలందరూ సహకరించాలని ప్రొఫెసర్ సూరెపల్లి సుజాత, సీసీఐ సైదాబాద్ మండల కార్యదర్శి షేక్ మహమూద్‌లు కోరారు.

చకచకా పంచాయతీ భవనాల నిర్మాణాలు

- నేడు అన్నోజిగూడలో ప్రారంభించనున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, జనవరి 21 : పరిపాలన సౌలభ్యం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం 500జనాభా ఉన్న గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. అందులో భాగంగా కందుకూరు మండలంలో 23గ్రామ పంచాయతీలు ఉండగా.. నూతనంగా 12 పంచాయతీలు ఏర్పాటు చేయడంతో మొత్తం 35 గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. దీంతో శిథిలావస్థలో ఉన్న 12 గ్రామ పంచాయతీ భవనాలు గుర్తించి.. ఒక్కో భవన నిర్మాణానికి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కృషితో రూ.20లక్షల చొప్పున నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికే సరస్వతిగూడ, సార్లరావుల పల్లి తదితర గ్రామాల్లో పంచాయతీ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మరికొన్ని గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి. అన్నోజిగూడలో పూర్తయిన పంచాయతీ భవనాన్ని నేడు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభిస్తారని జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, సర్పంచ్ కాకి ఇందిరమ్మ దశరథ తెలిపారు.

నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనం

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

యోగా శిక్షణలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న భిక్షమయ్య గురూజీ, రామచందర్‌రావు

ఆర్కేపురం, జనవరి 21 : ఆధ్మాత్మిక యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని చిత్రలేఅవుట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెండ్యాల నాగేశ్ తెలిపారు. ఆదివారం చిత్రలేఅవుట్ కాలనీలో సత్యసాయి ధాన్య మండలి సహకారంతో కల్చరల్ సెక్రటరీ రామచందర్‌రావు ఆధ్వర్యంలో ఉచిత అంతర్ముఖ యోగా శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెండ్యాల నాగేశ్ హాజరై భిక్షమయ్య గురూజీతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి యోగా శిక్షణను ప్రారంభించారు. నరేందర్, సంపత్, మల్లికార్జున్, ఉపేందర్, గోవర్ధన్, శ్రీహరి, వల్లభరెడ్డి, ఇస్మాయిల్ గురూజీ తదితరులు ఉన్నారు.

మీర్‌పేట సీఐ కాశీ విశ్వనాథ్‌కు సత్కారం

మీర్‌పేట ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు తీసుకున్న కాశీ విశ్వనాథ్‌ను శాలువాతో సత్కరిస్తున్న మీర్‌పేట కార్పొరేటర్లు కీసర గోవర్ధన్ రెడ్డి, పసునూరి భిక్షపతి, హరినాథ్ రెడ్డి, బీమ్ రాజ్, నాయకులు పద్మ నర్సింహ యాదవ్, సోమేశ్వర్, శ్యామ్ సుందర్, వేణు గోపాల్, రంగారెడ్డి సత్తయ్య, దామోదర్ రెడ్డి ఉన్నారు. – బడంగ్‌పేట, జనవరి 21

నూతన తాగునీటి పైపులైన్‌కు ప్రతిపాదనలు

మలక్‌పేట, జనవరి 21: పాత మలక్‌పేట డివిజన్‌లోని అక్బర్ ప్లాజా వద్ద నూతన తాగునీటి పైపులైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించి.. ఉన్నతాధికారులకు పంపించామని డివిజన్ వాటర్‌వర్క్స్ మేనేజర్ అష్మత్ అలీ తెలిపారు. అక్బర్ ప్లాజా వద్ద కొనసాగుతున్న తాగునీటి పైపులైన్ మరమ్మతు పనులను ఆదివారం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాల క్రితం నిర్మించిన పైపులైన్లు శిథిలావస్థకు చేరడంతో తరతూ లీకేజీ సమస్య ఉత్పన్నమవుతోందని.. మరమ్మతులతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. నూతన పైపులైన్ పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు.

పైపులైన్ మరమ్మతు పనులు పరిశీలిస్తున్న వాటర్‌వర్క్స్ మేనేజర్ అష్మత్ అలీ

లయన్స్ క్లబ్ సేవలు వినియోగించుకోవాలి

కందుకూరులో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మహేంద్ర కుమార్‌రెడ్డి

కందుకూరు, జనవరి 21 : లయన్స్ క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ గంగాపురం చెన్నకిషన్‌రెడ్డి, వైస్ గవర్నర్ డాక్టర్ మహేంద్ర కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో కందుకూరు, ఆమనగల్లు లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ దామోదర్ రెడ్డి తండ్రి వీరారెడ్డి జ్ఞాపకార్థంగా అన్నదానం నిర్వహించడం పట్ల ఆయనకు అభినందనలు తెలిపారు. కందుకూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కుంచకూరి వెంకటేశ్వర్లు గుప్తా, సురుసాని సుధాకర్‌రెడ్డి, ఆమనగల్లు కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, జూలూరి రమేశ్, బిచ్చానాయక్, వెంకటేశ్, రాజు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదం

మలక్‌పేట, జనవరి 21: క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, అర్జున అవార్డు గ్రహీత చేతన్ ఆనంద్ తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్ షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్‌బీహెచ్ కాలనీలోని దిల్‌సుఖ్‌నగర్ షటిల్ కోర్టులో ఈనెల 25 వరకు నాలుగురోజుల పాటు జరుగనున్న 19వ ఇన్విటేషనల్ రిపబ్లిక్ డే బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలను హైదరాబాద్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు శారద గోవర్ధని, ఒలంపిక్స్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సుమిత్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి ఎన్.సిక్కిరెడ్డి, మూసారాంబాగ్ కార్పొరేటర్ బి.భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, రంగారెడ్డి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, టోర్నమెంట్ కన్వీనర్ కరెడ్ల శ్రీనివాసరావుతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ టోర్నమెంట్‌లో జంట నగరాల నుంచి 104 టీమ్‌లు పాల్గొనటం గొప్ప విషయమని పేర్కొన్నారు. దిల్‌సుఖ్‌నగర్ షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ చైర్మన్ సామ ప్రభాకర్‌రెడ్డి, అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సింగిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ అనిల్ జాదవ్, టోర్నమెంట్ కన్వీనర్ కరెడ్ల శ్రీనివాసరావు, కార్య నిర్వాహక కార్యదర్శి ఎ.రామకృష్ణ, ఉపాధ్యక్షులు జి.వెంకటేశ్వర్‌రెడ్డి, బి.వెంకటేశం, కోశాధికారి ఎం.స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభిస్తున్న అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, అర్జున అవార్డు గ్రహీత చేతన్ ఆనంద్